# గిరిజన వర్సిటీ కల సాకారం

- కేసీఆర్ సర్కారు కృషి ఫలితం
- ఎట్టకేలకు పదేళ్ల తర్వాత ప్రకటించిన ప్రధాని మోదీ
- మేడారం వనదేవతల పేరిట విశ్వవిద్యాలయం
- ఎన్నికల వేళ బీజేపీ గిమ్మిక్కు రాజకీయాలు
- రూ.900 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటన
- 335.04 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయింపు
- 2018 డిసెంబర్‌లోనే పూర్తయిన స్థల పరిశీలన



గిరిజన యూనివర్సిటీ కోసం 2018లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమిని పరిశీలిస్తున్న కేంద్ర బృందంతో రాష్ట్ర అధికారులు

ములుగు, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ) : దేశంలోనే ప్రతిష్ఠాత్మక గిరిజన యూనివర్సిటీకి ఎట్టకేలకు మోక్షం లభించింది. కేసీఆర్ సర్కారు పోరాట ఫలితంగా గిరిజనుల కల సాకారమైంది. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ములుగులో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుచేయాల్సి ఉన్నా పదేళ్లుగా కాలయాపన చేసిన మోదీ ప్రభుత్వం.. ఎన్నికల వేళ తప్పని పరిస్థితుల్లో ట్రైబల్ వర్సిటీపై ప్రకటన చేయాల్సి వచ్చింది. ఈమేరకు మహబూబ్‌నగర్‌లో ప్రధాని మోదీ ఈమేరకు ప్రకటన చేశారు. మేడారం వనదేవతలైన సమ్మక్క సారలమ్మ పేరిట యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో పాటు రూ.900 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనిని ములుగు జిల్లాకేంద్రంలోని గట్టమ్మ దేవాలయ పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నది. ములుగు కేంద్రంగా ఏర్పాటయ్యే యూనివర్సిటీ రాష్ట్రానికి తలమానికం కానున్నది.

### బీఆర్ఎస్ పోరాటాలతో దిగొచ్చిన కేంద్రం

ఉమ్మడి రాష్ట్ర విభజన చట్టమైన సెక్షన్ 93 షెడ్యూల్ 13(3) ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన గిరిజన యూనివర్సిటీ కోసం బీఆర్ఎస్ సర్కారు అనేక పోరాటాలు చేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సహా రాష్ట్ర మంత్రులు, ఎంపీలు కేంద్రానికి అనేకమార్లు విజ్ఞప్తులు చేయడంతో పాటు వివిధ రూపాల్లో నిరసనలు కూడా తెలపడంతో ఇన్నాళ్లకు మోదీ సర్కారు దిగొచ్చింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన రెండోసారి ము ఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కేసీఆర్ ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో పాటు కేంద్ర మంత్రులను కలిసి ఎన్నోసార్లు యూనివర్సిటీ విషయమై చర్చించారు. ఇందులో భాగంగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ చీఫ్ సెక్రటరీ 2018 డిసెంబర్ 31న యూనివర్సిటీ ఏర్పాటు కోసం కేటాయించిన భూములను పరిశీలించి తుది నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించడంతోపాటు యూనివర్సిటీ ఏర్పాటు, తాత్కాలిక తరగతుల నిర్వహణ కోసం ములుగు మండలం జాకారంలోని వైటీసీ భవనాన్ని సైతం కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ భూములను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించిన ఇన్నాళ్లకు ప్రధాని ఆదివారం ప్రకటించారు. ఈ యూనివర్సిటీకి మేడారం సమ్మక్క సారలమ్మల పేర్లతో నిర్మించనున్నట్లు స్పష్టం చేశారు. యూనివర్సిటీ ఏర్పాటుకు రూ.900కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రధాని సభలో ప్రకటించారు.

### 335.04 ఎకరాల స్థలం కేటాయింపు

యూనివర్సిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం 335.04 ఎకరాల భూమిని కేటాయించింది. తొలుత కేంద్రం 500 ఎకరాల అవసరముందని నివేదించగా రెవెన్యూ, ఫారెస్టు శాఖలు సంబంధించి 487ఎకరాల 4గుంటల భూమిని గుర్తించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం రెవెన్యూకు సంబంధించిన సర్వే నంబర్ 837లోని 274 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులతో, సిబ్బందితో కలిసి సర్వే చేసి 120 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగించారు. ఈ భూములకు సంబంధించి అధికారులు జీపీఎస్ సర్వే కూడా చేయించారు. ఈ క్రమంలో 2018 డిసెంబర్ 31న కేంద్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఆర్. సుబ్రహ్మణ్యం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉప కులపతి అప్పారావు, సెంట్రల్ పబ్లిక్ వర్సిటీ సీఈ సాంబశివరావుల బృందం జిల్లాలో పర్యటించి కేటాయించిన భూములు యూనివర్సిటీ ఏర్పాటుకు అనువైనవని కేంద్రానికి నివేదిక సమర్పించారు. ఇందులో భాగంగా ప్రస్తుతానికి ఫారెస్టు, రెవెన్యూ శాఖలకు సంబంధించిన 335.04ఎకరాల ప్రభుత్వ భూమిని సిద్ధం చేసి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖకు అప్పగించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం గత రెండు బడ్జెట్‌లలో ఇప్పటివరకు రూ.19కోట్ల నిధులను కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం తమ వంతు పాత్ర పోషించి జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య ఆధ్వర్యంలో సదరు స్థలానికి శాశ్వత ప్రాతిపదికన హద్దు రాళ్లు అమర్చారు.

### ప్రపంచ చరిత్రలో ములుగుకు చోటు

ఏజెన్సీ ప్రాంతమైన ములుగు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ నూతన జిల్లాగా రూపాంతరం చెందడంతో పాటు దేశంలోనే ప్రతిష్ఠాత్మక గిరిజన విశ్వవిద్యాలయానికి కేంద్రంగా మారనున్నది. ప్రపంచ చరిత్రలో ములుగు చోటు సంపాదించుకోనుంది. ఇప్పటివరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అమర్‌టంక్ జిల్లాలో మొదటి గిరిజన యూ నివర్సిటీ రూ.1100కోట్ల వ్యయంతో నెలకొల్పగా రెండోది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటైంది. కాగా, ప్రస్తుతం ములుగులో అంతకు మించిన వ్యయంతో 3వ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటై ములుగు జిల్లాకు కలికితురాయిగా మారనున్నది. ఇప్పటికే ఈ ప్రాంతంలో కాకతీయుల నాటి అతిపెద్ద సరస్సులు అయిన రామప్ప, లక్నవరం అందుబాటులో ఉన్నాయి. దీనికి తోడు ములుగులో లోకం చెరువు సైతం యూనివర్సిటీ స్థలాలకు ఆనుకొని ఉండడం విశేషం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 163వ జాతీయ రహదారికి ఆనుకొని రవాణా పరంగా సైతం ఎలాంటి ఇబ్బందులు లేవు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు, సిబ్బందికి గంట సమయంలో వరంగల్‌లోని రైల్వేస్టేషన్ మార్గం ద్వారా, త్వరలో మామునూరులో అభివృద్ధి చెందనున్న విమానాశ్రయానికి సైతం చేరుకోవచ్చు. కేంద్రంపై బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పోరాటాల ఫలితంగా జిల్లాలో ఏర్పాటయ్యే గిరిజన విశ్వవిద్యాలయం ఈ ప్రాంత గిరిజన విద్యార్థులతో పాటు ఇతర ప్రాంతాల విద్యార్థులకు, స్థానికులకు వరంగా మారనున్నది.

## 'నకిలీ' భాగోతంపై ముమ్మరంగా విచారణ

- కన్సల్టెంట్ నిర్వాహకుడి కోసం పోలీసుల గాలింపు
- విజయవాడకు కమిషనరేట్ నుంచి రెండు టీంలు
- సీటు కోసం రూ.5లక్షలు చెల్లించినట్లు వెలుగులోకి..

పోచమ్మమైదాన్, అక్టోబర్ 1 : కాళోజీ వర్సిటీలో నకిలీ సర్టిఫికెట్లతో నాన్ లోకల్ విద్యార్థులు(ఏపీకి చెందిన వారు) లోకల్ కోటాలో సీట్లు పొందిన ఉదంతంలో విజయవాడకు చెందిన కన్సల్టెంట్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నట్లు తెలుస్తున్నది. మరోపక్క సదరు విద్యార్థుల తల్లిదండ్రులు మట్టెవాడ పోలీసులను ఆశ్రయించి, తమ కొడుకుల తప్పేమీ లేదని, అంతా కన్సల్టెంట్ మోసం చేయడం వల్లే జరిగిందంటూ మొరపెట్టుకున్నారు. కాగా, కాళోజీ వర్సిటీ అధికారుల ఫిర్యాదుతో మట్టెవాడ పోలీసులు రంగంలోకి దిగారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విజయవాడకు చెందిన కన్సల్టెంట్ నాగేశ్వర్‌రావు కోసం గాలింపు చేపట్టారు. వరంగల్ నుంచి రెండు టీఎంలు విజయవాడకు వెళ్లి లోకల్ పోలీసుల సహాయంతో కన్సల్టెంట్ కోసం తీవ్రంగా గాలిస్తున్నాయి.

### లోకల్ - నాన్ లోకల్ తెచ్చిన తంటా...

ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో లోకల్, నాన్ లోకల్ సీట్ల కోటా కింద సీట్లను కేటాయిస్తారు. కాళోజీ యూనివర్సిటీ పరిధిలో దాదాపు 5వేలకు పైగా సీట్లను భర్తీ చేయాల్సి ఉంది. ఇందులో లోకల్ 85శాతం ఉండగా, నాన్ లోకల్ కోటా కింద 15 శాతం భర్తీ చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు నకిలీ సర్టిఫికెట్లతో లోకల్ కోటా కింద సీట్లు పొంది అధికారులకు దొరికిపోయారు. విజయవాడకు చెందిన కన్సల్టెంట్ నాగేశ్వర్‌రావు ఎంబీబీఎస్ సీటు ఇప్పించడానికి రూ.4 నుంచి 5లక్షలు తీసుకున్నట్లు తెలుస్తున్నది. మట్టెవాడ పోలీసులను ఆశ్రయించిన సదరు విద్యార్థుల తల్లిదండ్రులు కన్సల్టెంట్ దందాను పూస గుచ్చినట్లు చెప్పారు. తమ పిల్లలు డాక్టర్లు కావాలని కలలు కంటూ సర్టిఫికెట్లు, డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తున్నది. అయితే ఎంబీబీఎస్ సీటు రావడానికి లోకల్, నాన్ లోకల్ గురించి అడగలేదని, తమ పిల్లలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఇచ్చి అప్‌లోడ్ చేయాలని చెప్పినట్లు పోలీసులు వివరించారు. ఎంతో కష్టపడి చదివిన పిల్లల ఎంబీబీఎస్ సీట్లను రద్దు చేస్తే వారి పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు పోలీసుల విచారణ, మరో వైపు పిల్లలను ఎలా కాపాడుకోవాలో తెలియడం లేదని, మరోపక్క లక్షల రూపాయలు పెట్టామంటూ వాపోతున్నారు.

## వాగులో పడి బాలుడి మృతి

ఏటూరునాగారం, అక్టోబర్ 1 : జంపన్నవాగులో స్నేహితులతో కలిసి స్నానం చేసేందుకు వెళ్లిన అస్లాం(14) నీటిలో మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. భూపాలపల్లికి చెందిన తయూమ్-రమీజాల కొడుకు అస్లాం ఏటూరునాగారంలోని తన పెద్దమ్మ ఇంటికి వచ్చాడు. స్నేహితులు, బంధువులతో కలిసి జంపన్న వాగులో స్నానం చేసేందుకు వెళ్లి కొట్టుకుపోయాడు. బంధువులు వాగులో అస్లాం ఆచూకీ కోసం గాలించారు. ఓడవాడ ప్రాంతంలో బాలుని మృతదేహం లభ్యమైంది. అస్లాం భూపాలపల్లిలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### విషజ్వరంతో మూడేళ్ల చిన్నారి..



అక్షర(ఫైల్)

మంగపేట : మండలంలోని కమలాపురం ఒడిషా కాలనీకి చెందిన బోయ అజయ్-మరియమ్మ దంపతుల మూడేళ్ల కూతురు అక్షర ఆదివారం విషజ్వరం సోకి మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఇటీవల అక్షరకు జ్వరం రాగా, ఏటూరునాగారంలోని ఓ దవాఖానలో చికిత్స చేయించారు. జ్వరం తగ్గకపోవడంతో వైద్యుల సూచన మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు తీసుకెళ్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. ఒక్కగానొక్క కుమార్తె మృతితో కుటుంబంలో విషాదం అలుముకున్నది.

## 'పెసా' సభలను పకడ్బందీగా నిర్వహిస్తాం

తాడ్వాయి, అక్టోబర్ 1 : పెసా గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించి గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని పెసా ములుగు జిల్లా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అన్నారు. ఈ నెల 3 నుంచి జరుగనున్న పెసా గ్రామ సభలపై చర్చించేందుకు మండలంలోని మేడారంలో ఆదివారం వరంగల్, మహబూబాబాద్, ములుగు జిల్లాల పెసా మొబిలైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. షెడ్యూల్ ప్రాంతంలోని ప్రతి లబ్ధిదారుడిని పెసా గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలని సూచించారు. మొబిలైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, పెసా కమిటీ సమన్వయంతో గ్రామసభలు నిర్వహించాలని, ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న 29 శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ మండలాల బాధ్యులు మడి సాయిబాబా, చింత కృష్ణ, ముత్యాలరావు, చంద్రయ్య, దేవానాయక్, రాజు, సమ్మయ్య, రవి, సురేందర్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బస్సులో అస్వస్థతకు గురైన కండక్టర్

ములుగురూరల్, అక్టోబర్ 1 : ఆర్టీసీ బస్సులో విధులు నిర్వర్తిస్తున్న కండక్టర్ అస్వస్థతకు గురయ్యారు. హనుమకొండ నుంచి పస్రా వెళ్తున్న ఆర్టీసీ బస్సులో కండక్టర్ సవిత డ్రైవర్ శ్రీనివాస్‌తో కలిసి ప్రయాణికులకు టికెట్లు ఇచ్చారు. ములుగు సమీపంలోని ప్రేమ్‌నగర్ వద్దకు రాగానే తీవ్ర అస్వస్థతకు గురై బస్సులో పడిపోయారు. డ్రైవర్‌తో పాటు తోటి ప్రయాణికులు ఆమెను చికిత్స కోసం ములుగు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు జ్వరం వల్లే ఇలా జరిగిందని చెప్పారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి మెరుగ్గా ఉందని తెలిపారు.

## తండ్రి, పని మనిషిపై కొడుకులు, అల్లుడి దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. దవాఖానకు తరలింపు
- తండ్రికి, పని మనిషికి వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతోనే దాడి

గోవిందరావుపేట, అక్టోబర్ 1 : గోవిందరావుపేట గ్రామంలోని తారక రామారావు కాలనీకి చెందిన సన్నగుండ్ల వెంకటేశ్వర్లు, పని మనిషి సుమలతపై ఇద్దరు కొడుకులతో పాటు అల్లుడు, బిడ్డ, భార్య దాడికి పాల్పడిన ఘటన ఆదివారం ఉదయం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కాలనీలోని తన సొంత ఇంట్లో సన్నగుండ్ల వెంకటేశ్వర్లు తల్లితో కలిసి ఉంటున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుమార్తె వివాహం అనంతరం హనుమకొండలో ఉంటున్నది. రెండేళ్ల క్రితం వెంకటేశ్వర్లు, భార్య సాంబలక్ష్మి మధ్య కుటుంబ కలహాలు తలెత్తడంతో సాంబలక్ష్మి హనుమకొండలోని తన బిడ్డ వద్ద ఉంటున్నది. వెంకటేశ్వర్లు తల్లి పక్షవాతంతో బాధపడుతుండడంతో హనుమకొండకు చెందిన పని మనిషి సుమలతను తల్లికి సేవ చేసేందుకు తీసుకువచ్చాడు. కాగా, సుమలతకు, వెంకటేశ్వర్లుకు అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో కొడుకులు వివేక్, శ్రావణ్‌కుమార్, భార్య సాంబలక్ష్మి, కుమార్తె తేజస్వి, అల్లుడు లక్ష్మీనారాయణ హనుమకొండ నుంచి కారులో వచ్చారు. వెంకటేశ్వర్లుపై బ్యాట్లు, చైన్, సుత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పనిమనిషిని చెట్టుకు కట్టేసి తీవ్రంగా కొట్టి తల వెంట్రుకలు కత్తిరించారు. కాగా, స్థానికులు ఇద్దరిని ములుగు దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతున్నారు. వెంకటేశ్వర్లు, పని మనిషి సుమలతను చంపేందుకు అతడి కుటుంబసభ్యులు కుట్ర పన్నారనే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పక్కా ప్రణాళిక ప్రకారం వెంకటేశ్వర్లుపై దాడి చేసేందుకు వారి వెంట కత్తులు, కర్రలు, చైను, బైబిల్ తెచ్చుకోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.



వెంకటేశ్వర్లుతో పాటు పని మనిషిపై దాడి చేసేందుకు తీసుకువచ్చిన కర్రలు, సుత్తి, తాడు



ములుగు దవాఖానలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు